

# పసిడిమనసులు - షర్మిల



## రావమ్మా మహాలక్ష్మీ !!

**ఇంటి ముందు** తాటిమట్టల చీపురుతో బరబరా వూడుస్తూ మా సామ్మామ్మ తిట్టే తిట్లతోనే నాకు తెల్లారేది. వూడ్చిన తరవాత పేడ కళ్లాపి చిక్కగా కలిపి జిమ్మి , ముగ్గేస్తుంది . పేడరంగు మీద తెల్లగా ముగ్గులేస్తే భలే అందంగా వుంటుంది.

" ఎంతమంది పాలేళ్లు బద్దలైనా నేనే వాకిట్లో ముగ్గెయ్యాలి ... ఇంటి ఇల్లాలు మునగతీసుకుని పొడుకుంటే ఎట్టా ? మొగాడు బయటకెల్లే లోగా ముగ్గేసుకోవద్దూ ... " ఇట్టా సాగేది.

ఆడపడుచు సుప్రభాతానికి మా నాయనమ్మ ఎప్పుడో లేచినా తన పనులేవో చక్కబెట్టుకుంటానే " నిన్నెవడు చేయమన్నాడు? నేను చేయించుకుంటాగా " అని సణుక్కునేది. ఒకవేళ గట్టిగా అంటే యుద్ధమే.

11 ఏళ్లకే మొగుడు పోతే చిన్న వయసులోనే పుట్టింటికి చేరిన సామ్మామ్మకి పుట్టిల్లే సర్వం ఐదుగురు తమ్ముళ్ల లో మా తాత చిన్న.

తాత వుండే పెద్ద పెంకుటింట్లో ఆమెకో గది ప్రత్యేకంగా వుండేది.

ఆ గది సంవత్సరంలో మూడు నాలుగు నెలలు మూసే వుండేది .

ఆవిడ చుట్టుపక్కల వూళ్లల్లో వున్న చుట్టాలను తిరగేసి వాళ్ల ఇళ్లల్లో పదిహేనేసి రోజులుండి ఇంటికి చేరేది.

సామ్మామ్మ గదిలో ఒక పక్క దేముడి మందిరం, ఒక అల్మారా , ఒక కావిడి పెట్టె , దానిమీద ఒక ట్రంకు పెట్టె వుండేవి. ఆ అల్మారా తీస్తే ఒకరకమైన ముంజు వాసన వచ్చేది. కావిడి పెట్టెలో ఆమె కట్టుకునే పంచెలు వుండేవి.

ఆమె రంగులో కలిసిపోయే తెల్లటి పంచెలు, కొన్ని తెలుపు తగ్గి నీరుకావి రంగుకి తిరిగినవి కొన్ని వుండేవి. 11 ఏళ్ల వయసు నుంచి ఆవిడని జాకెట్టు వేసుకోనీయలేదంట. అందుకే ఆరు గజాల పంచె నే నిండుగా చుట్టుకునేది .

ఎప్పుడు చూసినా "కట్టుకోడానికి పంచెలు లేవే అమ్మడూ! మీ తాత నా పంట డబ్బులు ఇవ్వలేదే " అని నాకు ఫిర్యాదు చేసేది .

దేముడుకి పెట్టే పటికబెల్లం, సాంబ్రాణి కడ్డీలు కొనడానికి, వూర్లు తిరగడానికి డబ్బు ఖర్చు బాగానే చేసేది.

నేనంటే సామ్మమ్మకి ముద్దు కావడంతో నాకు రోజూ పటిక బెల్లం ప్రసాదం దొరికేది. అంతేకాదు ఆవిడ శనివారం సాయంత్రం చేసుకునే తీపి గోధుమ అట్లలో కూడా వాటా దక్కేది. కట్టుడు పళ్లు అయినా చెరుకు అంటే వున్న ఇష్టంతో కత్తిపీట తో చిన్నచిన్న ముక్కలు తరిగి, తను తింటూ నాకూ కొన్ని ఇచ్చేది .

మా తాత ప్రకృతి వైద్యంలో నియమాలు పాటించే వారు. ఇది తింటే వేడి... అది తింటే జలుబు అంటా మమ్మల్ని ఏమీ తిననిచ్చేవారుకాదు. నాకు సీమతుమ్మ కాయలంటే ఎంతిష్టమో కానీ అవి తింటె పొట్టలో పసరు అని చచ్చినా మా చిట్టెమ్మని కొననిచ్చే వారు కాదు.

ఒక రోజు సీమతుమ్మకాయలు కావిట్లో వేసుకుని అమ్మడానికి వచ్చినతన్ని సామ్మామ్మ కేకేసింది. కాయలు కొంటా వుండగా తాత చూసి " ఎవరికి?" అని అడగగానే సామ్మామ్మ " నేనే కొనుక్కుంటన్నా తిందామని " అనేసరికి తాత మాట్లాడలా.

తాత మధ్యాన్నం పడుకున్నప్పుడు సామ్మామ్మ నన్ను చాటుగా పిలిచింది. "అమ్మడూ సీమతుమ్మ కాయలు నీకే కొన్నా తిను" అని వళ్లో పోసింది. ఆనందంగా తినేశా .

ఎందుకో నా ఖర్మకాలి జ్వరం వచ్చింది. ఇక చూస్కోండి తాత తిట్లకి అంతులేదు. " నాకు తెలుసు ... ఆ సీమతుమ్మకాయలు దీనికి కాదని ... దొంగ తిళ్లు మేపింది , ఇదిగో ! ఇప్పుడు పసరు పొట్టలో పేరుకు పోయి రోగం తెచ్చుకుంది" సామ్మామ్మ నేను కిక్కురుమంటే ఒట్టు.

మా సామ్మమ్మ తన ఇత్తడి సామాను మీద పేరు విచిత్రంగా వేయించుకునేది . నా.కు. య. సతమ్మ అని వుండేది. నాగయ్య గారి కుమార్తె యలమంచిలి సరస్వతమ్మ అనే పేరుని పొట్టిగా అట్లా రాయించేది. ఎందుకంటే మా వూళ్లో ఇంకో ఇద్దరు సరస్వతమ్మలు వుండారంట. ఒకేళ ఏ శుభ కార్యాలకైనా సామాన్లు పట్టికెళ్తే మారిపోకుండా ఈ పేర్లేయించుకునేది .

సామ్మామ్మని పేరంటాలకి ఎవరూ పిలవక్కర్లా ఎవరింటో సందడి వుంటే అక్కడికి వెళ్లేది. బంతిభోజనాల్లో కూర్చుని సుష్టుగా తినేది.

ప్రతి శుక్రవారం సాయంత్రం ఇంటి సింహద్వారం తెరిచి గుమ్మం దగ్గర కూర్చుని లక్ష్మిదేవీ రావమ్మా అంటా పాటలు పాడేది.

" ఎందుకు సామ్మామ్మా! పాటలు పాడుతున్నావ్?" అంటే " మీ తాతకి బోల్డు డబ్బులు రావాలని లక్ష్మీదేవిని అడుగుతున్నానే " అంది.

ఆ రోజు మా నాయనమ్మ ఎవరో ఒకాయన వస్తే ఆయన్నేసుకుని ఇల్లంతా చూపిస్తాంది. మధ్యలో ఇంట్లో కష్టాలన్నీ ఏకరువు పెడతాంది.

సామ్మామ్మ గది వరకూ వచ్చాక ఇది మా ఆడపడుచు గది అని చెప్పింది. " అదీ మీ కష్టాలకి కారణం అర్ధమైపోయింది. ఇదిగో ఈ మూల విధవావిడ గది వుండకూడదు. ఇంట్లో వూడ్చడాలూ అవీ చేస్తారా ఆవిడ? " అని ఆరా అడిగాడు.

" తెల్లారేసరికి వూడ్చి ముగ్గులేస్తారండి " మా చిట్టెమ్మ సమాధానం.

" ఇంకేం చెప్పకండి మీ డబ్బులన్నీ వూడ్చుకు పోతున్నాయ్ అందుకే " అని తేల్చేశాడు .

పక్కన నించుని వున్న నేను "ఏం కాదు మా తాత బీరువాలో ఎప్పుడూ సంచి నిండా డబ్బులుంటాయ్, అసలు ఈయన అన్నీ అబద్దాలే ... " అనేలోగా జరగబోయే ప్రమాదాన్ని పసిగట్టి చిట్టెమ్మ నా నోరు మూసేసింది .

ఆయన వెళ్లాకా " సామ్మమ్మ ఆ గదిలో వుంటే కష్టాలన్నాడు గదా ! మనకేం లేవు ... ఆయన అన్నీ అబద్ధాలే చెప్తున్నాడు. సామ్మమ్మని రోజూ పూజ ఎందుకు చేస్తున్నావంటే కష్టాలు రాకుండా" అని చెప్పింది. ఇంకా శుక్రవారం సాయంత్రాలు లక్ష్మీదేవిని కూడా రమ్మని, డబ్బులివ్వమని పాటలు పాడుతుంది అన్నాను. కాలం గడిచిపోయింది.

సామ్మామ్మ, తాత, చిట్టెమ్మ ఎవరూ ఇప్పుడులేరు. కానీ మా తాత ఇంటి సింహద్వారం మాత్రం పుట్టింటివాళ్లకి డబ్బులు కురిపించమని అడిగే ఆడపడుచు పాడే పాటకోసం ఎదురు చూస్తున్నట్టనిపిస్తుంది.

*(వచ్చేనెల మరో కథ)*

COMMENTS